మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి మండలంలో మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల కృష్ణం రాజుపేట ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్ వాడడం వలన ఆర్థికంగా, శారీరకంగా, మానసికంగా కలిగే నష్టాలను వివరించారు. మత్తు పదార్థాల వల్ల కుటుంబం చిన్నాభిన్నం అవుతుందని అన్నారు. కిడ్నీలు, జీర్ణ వ్యవస్థ, గుండె సంబంధిత వ్యాధుల బారిన పడి జీవితాన్ని చిద్రం చేసుకోవద్దని అవగాహన కల్పించారు.

యథేచ్ఛగా ప్రభుత్వ స్థలాలు ఆక్రమణ

కారు చౌకగా కమర్షియల్ స్థలాలను కొట్టేస్తున్న నాయకులు

ఇంటి అద్దెను మించిన షాపు అద్దెలు

ఒక్కో షాప్‌కి 4 నుంచి 6వేలు వరకు వసూలు

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం గంభీరం పంచాయతీ ఆర్టీవో కార్యాలయం నేషనల్ హైవేకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాలను ఇష్టానుసారంగా ఆక్రమించేస్తున్నారు. ఎవరైతే మాకేంటి అన్నట్లుగా స్థలాలు కబ్జాలు చేసి లక్షల ధరకు క్రయ విక్రయాలు చేపడుతున్నారు. ఎవరైనా అడిగితే బెదిరిస్తూ దందా నడుపుతున్నట్లు సమాచారం. స్థానిక అధికార పార్టీ నాయకులు ప్రభుత్వ స్థలాలను ఆక్రమణ చేసుకుని అధికారులను బెదిరిస్తూ కరెంటు మీటర్లను తెచ్చుకొని వారి స్థావరాలుగా ఏర్పాటు చేసుకొని, చిన్న చిన్న షాపులుగా కేటాయించి అనంతరం షాపులను అద్దెకు ఇస్తూ లక్షలాది రూపాయలు గడిస్తున్నారు. ఎవరైనా అడిగితే మా ఇష్టం మేము అధికారంలో ఉన్నామని, మేము చెప్పినది శాసనం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. వివరాల్లోకెళ్తే గంభీరం సర్వే నెంబరు 174/3లో నేషనల్ హైవే స్థలం, ప్రభుత్వ గెడ్డ మొత్తంగా ఆక్రమించేసి 6 నుండి 10 షాపులను ఏర్పాటు చేశారు. ఇటీవల కాలంలో కరెంట్ మీటర్లను కూడా తీసుకున్నట్లు సమాచారం. సర్పంచ్ కనుసన్నల్లో ఈ దఇందా నడుస్తున్నాయని పలువురు వాపోతున్నారు. ఈ షాపులను భవాని, పీతల ప్రసాద్, ఉప్పాడ పద్మ, కొండమ్మ తదితరులు కొంతమంది ఆక్రమణలు చేపట్టి షాపులను ఏర్పాటు చేసి అద్దెకిస్తున్నట్లు తెలుస్తుంది. ప్రతి నెల వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారు. ఈ క్రమంలో స్థానికంగా ఉన్న వైయస్సార్ విగ్రహం పక్కన ఇటీవల వేరే వర్గం వారు చిన్నపాటి బడ్డీ పెట్టుకొని నిరుపేద కుటుంబాన్ని పోషించుకుందా మనుకుంటే వారిని భయభ్రాంతులకు గురి చేశారు. ఈ విషయంతో రాజకీయ నాయకుల తతంగం మొత్తం వెలుగులోకి వచ్చింది. అటు నేషనల్ హైవే అధికారులు రెవెన్యూ యంత్రాంగం చొరవ తీసుకొని ప్రభుత్వ స్థలాలను కబ్జాకు గురికాకుండా చూడాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రైవేట్ విద్యార్థులకు కూడా ప్రతిభ అవార్డులు ఇవ్వాలి

విశాలాంధ్ర - గాజువాక: రాష్ట్ర ప్రైవేట్ పాఠశాలల సంఘం (అప్సా) సభ్యులు పాఠశాల విద్యా కమిషనర్ విజయరామ రాజుని విజయవాడలో ఆయన కార్యాల యంలో కలిసి రాష్ట్రంలోని చిన్న చిన్న ప్రైవేట్ పాఠశాలలు పడుతున్న అనేక సమస్యలు వివరించారు. ప్రధానంగా ఆర్‌టీఈ యాక్ట్ ద్వారా గత 3సం.లుగా ఉచిత అడ్మిషన్లు పొందిన విద్యార్థుల ఫీజు రీయంబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయించాలని, ప్రైవేట్ బడుల్లో చదువుచున్న విద్యార్థులకు కూడా ప్రతిభ అవార్డులు, ఐఐటి సీట్లు కేటా యించాలని, నర్సరీ, యల్‌కేజీ, యూకేజీ తరగతులకు కూడా గుర్తింపు ఇప్పించాలని కోరారు. కమిషనర్‌ని కలిసిన వారిలో వి.సుందరమ్, అప్సా రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం రాజు, కార్యదర్శి సింహాచలం, గౌరవ అధ్యక్షుడు జనార్ధన్, ఫైనాన్స్ సెక్రటరీ పి.భాస్కరరావు, అప్పలనాయుడు, గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణపై గీతం న్యాయవిద్యార్థుల ర్యాలీ

విశాలాంధ్ర - మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గల గీతం స్కూల్ ఆఫ్ లా లీగల్ ఎయిడ్ సెల్ ఆధ్వర్యంలో హెల్మెట్ ధారణ - రహదారి భద్రతపై ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. గీతం స్కూల్ ఆఫ్ లా డీన్ ప్రొఫెసర్ అనితారావు

మాట్లాడుతూ విద్యార్థులు, ప్రజలు వాహనాన్ని రోడ్డుపై నడిపేటప్పుడు హెల్మెట్ ధరించడం, సీటుబెల్టు పెట్టుకుని తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ ర్యాలీ సందర్భంగా హెల్మెట్ ధరించండి ప్రాణాలను రక్షించుకోండి అనే నినాదంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలను విధిగా అనుసరించాలని, చట్టాలను గౌరవించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో గీతం న్యాయ సలహా కేంద్ర కన్వీనర్ డాక్టర్ సి. హెచ్.లక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా స్థాయిలలో న్యాయ సేవాధికార సంస్థ సామాన్య ప్రజలకు న్యాయ సహాయం అందించడం చేస్తోం దన్నారు. నాగార్జున యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ ఎ.రాజేంద్రప్రసాద్, డాక్టర్ హరీష్‌వర్మ, ఎన్.ఎ.రాజు, పూర్ణిమ, చిత్ర సక్సేనా, నవీన్ సిస్టా, లా విద్యార్థులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బొత్స

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: వైసీపీ పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించిన సీనియర్ నాయకులు బొత్స సత్యనారాయణని ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైసీపీ అధినేత జగన్ ఖరారు చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లా సమావేశంలో నిర్ణయం తీసుకు న్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ వైసీపీ అభ్యర్థిగా బొత్స సత్యనారా యణను ఎంపిక చేసిన పార్టీ అధ్యక్షుడు వైయస్.జగన్మోహన్‌రెడ్డి ఉమ్మడి విశాఖ జిల్లా నాయకుల సమావేశంలో నాయకుల అభిప్రాయాలు తీసుకుని అనంతరం బొత్సను ఎంపిక చేశారు. ఎమ్మెల్సీ వంశీకృష్ణ వైసీపీ నుంచి జనసేనలోకి వెళ్లడంతో అనర్హత వేటుతో ఈ ఎన్నికను ఈసీ ప్రకటించింది. ఈ ఎమ్మెల్సీ ఎన్నికలో జీవీఎంసీ కార్పొరేటర్లు, యలమంచిలి, నర్సీపట్నం మున్సిపాలిటీల కౌన్సిలర్లు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలకు ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉంది. మొత్తం ఓట్లు 841 ఉండగా, అందులో వైసీపీ బలం 615 ఉండగా, టీడీపీ, జనసేన, బీజెపీ సభ్యులకు కేవలం 215 ఓట్లు ఉన్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికలు నేపథ్యంలో వలసలపై కూటమి ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. ఇప్పటికే జీవీఎంసీలో 12 మంది వైసీపీ కార్పొరేటర్లు పార్టీ ఫిరాయింపులకు దిగారు. మరికొంతమంది లోపాయికారికంగా టీడీపీ కూటమికి మద్దతు ఇస్తున్నట్లు తెలుస్తుంది.

విద్యార్థిని అదృశ్యం

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం పొంద్రంగి గ్రామానికి చెందిన షేక్ చాన్బీ (18) అదృశ్యమైనట్లు పద్మనాభం పోలీసులు తెలిపారు. ఈమె ఓం సాయి.కామ్ కాలేజీలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యను అభ్యసిస్తున్నట్లు తెలియజేశారు. ఈమె ఆచూకీ తెలిసినట్లయితే 9490617920, 9177068006కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

సమస్యలపై ఎమ్మెల్యే గంటాకు వినతి

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం సిర్లపాలెం గ్రామ పంచాయతీలో వలు సమస్యలపై గ్రామ పంచాయతీ టీడీపీ అధ్యక్షులు కోరాడ గౌరీ నాయుడు భీమిలి శాసనసభ్యులు గంట శ్రీనివాసరావుకి దృష్టికి తీసుకువెళ్లారు. సిర్లపాలెం గ్రామంలో ఇనాం భూముల సమస్యలు పరిష్కరించాలని, ఎంకమ్మ చెరువు పూడికపోయిందని 45 అడుగుల ఉన్న చెరువు గెడ్డ పూడుకుపోయి ప్రస్తుతం 10 అడుగులు ఉందని చెరువుకు నీరు వెళ్లే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే మరిడమ్మ గుడి రోడ్డు ఏర్పాటు చేయాలని ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. గ్రామంలో రామాలయం నిర్మాణం మధ్యలోనే ఆగిపోయిందని గుడి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరారు. వీటిపై స్పందించిన శాసనసభ్యులు గంట శ్రీనివాసరావు స్పందించి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు గౌరి నాయుడు తెలిపారు.

ఎర్రమట్టి దిబ్బల తవ్వకాలపై స్పందించిన మైనింగ్ అధికారులు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: భీమిలి సమీపంలో సముద్ర తీరాన ఉన్న ఎర్రమట్టి దిబ్బల అక్రమ తవ్వకాలపై జిల్లా మైనింగ్ అధికారులు స్పందించారు. ఎర్రమట్టి దిబ్బలను తవ్వుతూ విధ్వంసం చేస్తున్న ప్రదేశం తీరప్రాంత క్రమబద్ధీకరణ మండలి (సి ఆర్ జెడ్) జోన్-1 సున్నితమైన పరిధిలోకి వస్తుందని జూలై 18న గనులశాఖకు జనసేన నేత పీతల మూర్తి యాదవ్ ఫిర్యాదు చేశారు. ఆ మేరకు స్పందించిన గనుల శాఖ షోకాజ్ నోటీసులను జారీ చేసింది. ప్రభుత్వ శాఖల నుండి అనుమతులు పొందకుండా నేరెళ్ళ వలస గ్రామం సర్వే నెం:118/5ఎ (పాత సర్వే నెం :49/1)లో ది భీమినిపట్నం మ్యూచువల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ బిల్డింగు సొసైటీ 278.95 ఎకరాలలో అక్రమంగా తవ్వకాలు చేసింది. ఎర్రమట్టి దిబ్బలలో అక్రమ లే ఔట్ పనులలో భాగంగా రోడ్ల నిర్మాణం కోసం పూరించడానికి 39,454 క్యూబిక్ మీటర్ల కంకర ఉపయోగించారని మైనింగ్ అధికారులు లెక్క కట్టారు. ఆంధ్ర ప్రదేశ్ మైనర్ మినరల్ కన్సెషన్ రూల్స్-1966ను ఉల్లంఘించారని పేర్కొన్నారు. పదిహేను రోజుల్లోగా వివరణ ఇవ్వాలని లేనిచో భీమినిపట్నం మ్యూచువల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ బిల్డింగు సొసైటీపై చట్ట పరంగా ఎందుకు చర్యలు తీసుకోకూడదో తెలియజేయాలని షోకాజ్ నోటీసులో పేర్కొన్నారు. ప్రపంచ స్థాయిలో ప్రసిద్ధ పర్యాటక ప్రాంతంగా గుర్తింపు పొంది మన వారసత్వ సంపదగా ఎర్రమట్టి దిబ్బలు ఉన్నాయి. ఇటువంటి వారసత్వ సహజ సంపద కావలసిన

అవసరం ప్రభుత్వానికి ఉంది. ఇదే విషయాన్ని పర్యావరణ ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థలు గత ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లినా ఫలితం దక్కలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఎర్రమట్టి దిబ్బలలో జరుగుతున్న తవ్వకాలపై వారు తిరిగి పోరాటం సాగించారు. ఎట్టకేలకు మైనింగ్ అధికారులు స్పందించి తవ్వకాలు జరుపుతున్న సంస్థకు జారీ చేయడం పట్ల నగర ప్రజలు, పర్యాటకులు, పర్యావరణ వేత్తలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మనో వేదనలో కార్మికులు

విశాలాంధ్ర - గోపాలపట్నం: **జీవీఎంసీ, దేవస్థానం**

పారిశుధ్యం, సెక్యూరిటీ, వివిధ విభాగాల కార్మికులు, నాలుగవ తరగతి సిబ్బంది సమన్వయంతో సింహాద్రి అప్పన్న గిరిప్రదక్షిణ విజయవంతమైంది. అయితే ఆయా విభాగాల కార్మికులు, సిబ్బంది వారి సేవలను కూడా గుర్తించండి అంటూ మదన పడుతున్నారు. చందనోత్సవం, సుదర్శన నారసింహ యజ్ఞం, గిరిప్రదక్షిణ మొదలగు ఉత్సవాల్లో పగలు, రేయి కాయకష్టం తమది, సన్మానాలు, అభినందనలు వారికా అంటూ మనోవేదన చెందుతున్నారు.

మొన్న సింహగిరిపై ఈఓ ఎస్.శ్రీనివాసమూర్తి జిల్లా అధికారులకు ప్రశంసా పత్రాలు, మెమెంటో, మీడియా మిత్రులకు స్వామివారి లడ్డూ, స్వీట్, సేవా సంస్థలకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేసి సత్కరించిన సంగతి పాఠకులకు విదితమే. అయితే ఎటువంటి ఉత్సవ సందర్భాల్లోనైనా ఎండనక, వాన, చినుకులు సైతం లెక్క చేయకుండా సింహాద్రి అప్పన్న సేవగా భావించి జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది, దేవస్థానం నాలుగవ తరగతి సిబ్బంది, పారిశుధ్యం, సెక్యూరిటీ సిబ్బంది కష్టపడి విధులు నిర్వహిస్తారు. ప్రతీ చిన్న పనికి, కోపం వస్తే మందలించటానికి క్రింది స్థాయి, పొరుగు సేవలు, డైలి వేజ్ సిబ్బంది బలౌతుంటారు. ఏనాడైనా ఏ అధికారైనా ఆ ఉద్యోగి లేకుంటే నేను ఇక్కడ(ఆఫీస్)లో కూర్చుని విధులు నిర్వ హించగలనా అని తమ గుండెపై చేయి వేసుకుని ఆలోచిం చారా సార్లు. భగవంతుడు ప్రతిదీ లెక్క వేస్తాడు. ఖర్మ ఎవ్వరినీ విడిచి పెట్టదు అందరూ పల్లకీ పైన కూర్చుంటే పల్లకీ మోసే దెవరు. పల్లకీ మోసే వాడికి తెలుస్తుంది పల్లకీ బరువెంతో. కనుక వారిని కూడా అధికారులు అప్పుడప్పుడు గుర్తిస్తే పల్ల కిలో ఉన్న భగంతుడు కంటే మీరే ప్రత్యక్ష దైవంగా భావిస్తారు.

విభాగాలను తనిఖీ చేసిన ఇన్‌చార్జి వీసీ

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పలు విభాగాలను ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య జి.శశిభూషణరావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగాన్ని సందర్శించారు. విభాగంలో ఎంహెచ్‌ఆర్‌ఎం సెమిస్టర్ పరీక్ష జరుగుతున్న విధానం ప్రత్యక్షంగా పరిశీలించారు. పరీక్షకు హాజరైన విద్యార్థులు, పరీక్ష నిర్వహణ విధానం ప్రత్యక్షంగా గమనించారు. అనంతరం స్వాతంత్ర్య దినోత్సవం నిర్వహించే బాస్కెట్ బాల్ మైదానాన్ని సందర్శిం చారు. అక్కడ చేయవలసిన ఏర్పాట్లపై సెక్యూరిటీ డీన్ ఆచార్య అరుణ్ కుమార్‌తో చర్చించారు. ఏయూ న్యాయ కళాశాలలో తరగతులు జరుగుతున్న విధానాన్ని ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. విద్యార్థులతో స్వయంగా మాట్లాడారు. తరగతులు సక్ర మంగా జరుగుతున్నాయా, సమయ పాలన పాటిస్తున్నారా, విభాగంలో, తరగతి గదిలో, కళాశాలలో, హాస్టల్‌లో ఎటువంటి సమస్య ఉన్నా తనకు చెప్పండి అంటూ విద్యార్థులను అడిగారు. విద్యార్థులకు చిన్న ఇబ్బంది ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని సూచిం చారు. తరగతులు సక్రమంగా జరుగుతున్నాయని విద్యార్థులు సమాధానమిచ్చారు. వీసీ వెంట ప్రిన్సిపాల్స్ ఆచార్య కె.సీతామణిక్యం, ఏ.నరసింహారావు ఉన్నారు.

ఘనంగా పింగళి వెంకయ్య జయంతి

విశాలాంధ్ర - తగరపువలస: తగరపువలస 1వ వార్డు జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల బంగ్లా మెట్ట నందు శుక్రవారం జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారిణి-2 అట్టాడ జయప్రద పాల్గొని మాట్లాడారు. జాతీయ పతాక నిర్మాత పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా ఆయన గురించి విద్యార్థులకు వివరించారు. పాఠశాల నిర్వహణ కమిటీ ఎన్నికలను సక్రమంగా నిర్వహించాలని దానికి సంబంధించి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రెడ్డిపల్లి అప్పలరాజు, నరహర శెట్టి రమేష్, బిగత మల్లిక, పిన్నింటి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ వేణుగోపాల్‌కు సత్కారం

విశాలాంధ్ర - పెందుర్తి: పెందుర్తి తహశీల్దారుగా బాధ్యతలు చేపట్టిన వేణుగోపాల్‌ను మండల పరిషత్తు ఉపాధ్యక్షులు సిరికి దేముడుబాబు, వైయస్సార్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు గొరపల్లి శ్రీనివాసరావు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా ఇక్కడికి బదిలీపై వచ్చిన తహహశీల్దార్‌ను కలిసి శాలువాతో సత్కరించి పూల బొకే అందించి అభినందనలు తెలియజేశారు.

పారిశ్రామిక ప్రగతికి కేంద్ర బడ్జెట్ దోహదం

గీతం సదస్సులో నిపుణుల వెల్లడి

విశాలాంధ్ర - మధురవాడ: కేంద్ర బడ్జెట్‌లో వివిధ విభాగాలకు జరిగిన కేటాయింపుల వల్ల దేశంలో పారిశ్రామిక ప్రగతికి దోహదం కలిగించే వాతావరణం ఏర్పడనుందని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన బడ్జెట్ సమీక్షలో నిపుణులు అభిప్రాయపడ్డారు. జీఎంఆర్ ఎయిర్ పోర్ట్సు డైరెక్టర్ డాక్టర్ ఈమంది శంకరరావు మాట్లాడుతూ దేశంలో మౌలిక సదుపాయాల రంగానికి, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల రంగానికి కేంద్ర బడ్జెట్‌లో ప్రత్యేక కేటాయింపులు చేయడం దేశ ఆర్థిక ప్రగతికి, ఉపాధి అవకాశాలు పెరగడానికి దారి తీస్తుం దన్నారు. శ్రావణ్ షిప్పింగ్ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి.సాంబశివరావు మాట్లాడుతూ దేశంలో పారిశ్రామిక రంగం సవాళ్ళను ఎదుర్కొంటున్న సమయంలో కేంద్రం వివిధ పథకాలను ప్రకటించడం ముఖ్యంగా చిన్న మధ్య తరహా పరిశ్రమలకు ఊపిరి పోసేదిగా ఉందన్నారు. సిడ్బి మాజీ అధికారి వి.ఎస్.వి.రావు మాట్లాడుతూ పరిశ్రమలు పోత్సహించే విధంగా ముద్రయోజన వంటి పథకాలు ఉపయోగపడగలవన్నారు. ఆర్.కె.సంఘు అసోసియేట్స్ వ్యవస్థాపకుడు రామకృష్ణసంఘు మాట్లాడుతూ వివిధ స్థాయిలలో ఆదాయపు పన్నులో కేంద్ర బడ్జెట్ ద్వారా ఉపశమనం కల్పించారని పేర్కొన్నారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎమ్-విశాఖ) అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.కల్యాణ్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ దేశ ఆర్థికప్రగతికి ఏవిధంగా దోహద పడుతుందో వివరించారు. కార్యక్రమానికి గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు అధ్యక్షత వహించగా, డాక్టర్ రాధా రఘురామ పాత్రుని కేంద్ర బడ్జెట్ విశేషాలను, కీలక అంశాలను వివరించారు. డాక్టర్ ఇష్రాత్ నాజ్ కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకలు తదితరులు పాల్గొన్నారు.

మట్టిపాలౌతున్న అప్పన్న సొమ్ము

విశాలాంధ్ర - సింహాచలం: రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖలో కొందరు ఉన్నతాధికారుల అనాలోచిత నిర్ణయాల వలన సింహాద్రినాధుని సొమ్ము హారతి కర్పూరంలా హరించుకుపోతుంది. కాంట్రాక్టర్‌కు కాసుల పంట పండుతుంది. 2010లో కొండపైన హిల్ టాప్ రోడ్ మార్గంలో గిరిజనుల కాలనీ పేరుతో 15 భవనాలు, 6 రేకుల భవనాలు నిర్మించారు. అప్పట్లో ఒక్కో భవనం ఖర్చు రూ.1.30 లక్షలు. అయితే అప్పటి దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ జేఎస్‌వీ ప్రసాద్ ఈ గదులను దూరప్రాంతాల నుండి వచ్చిన భక్తులకు అద్దెకు ఇవ్వమని దేవస్థానం అధికా రులకు ఆదేశాలు జారీ చేశారు. అందుచేత అధికారులు మరిన్ని హంగులతో 2011 - 2012 మధ్య ఒక్కో భవనంపై అదనంగా రూ.1.10 లక్షలు ఖర్చు పెట్టి సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దారు. ప్రస్తుతం వీటి ఖరీదు ఒక్కొకటి రూ.3.20 లక్షలు, 6 రేకుల భవనాల ఖరీదు రూ.10 లక్షలు ఖర్చుతో వరాహ లక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానం వారు మార్పులు చేర్పులు చేశారు. ఈ భవనాలు ఎవరికీ ఉపయోగపడలేదు. దూర ప్రాంతాల భక్తులు రాత్రి వేళల్లో బస చేయాలంటే చుట్టూ అటవీ ప్రాంతమాయే. ఎవరి భయం వారికి ఉంటుంది మరి. ప్రస్తుతం ఈ అధునాతన గదుల్లో మద్యం సేవించటం, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం. తాళాలు బద్దలు కొట్టి కొన్ని గదుల్లో వున్న పంకాలు, విద్యుత్ దీపాలు, స్విచ్ బోర్డులు, కొళాయిలకు సంబంధించిన పైపులు కొందరు దుండగులు ఎత్తుకెళ్లగా, అప్పట్లో కొన్నింటిని అధికారులు వాటిని తొలగించి భద్రపరిచారు. అయితే మరో కోణంలో ఆలోచిస్తే ప్రస్తుతం రోజులు అసలే బాగులేవు. ఏ సంఘ విద్రోహ శక్తులు రెక్కి నిర్వహించరనే భరోసా ఏంటని భక్తులు అంటున్నారు. ఈ విషయంపై ఆలయ అధికారులు ఆ గదులపై సరైన నిర్ణయం ఎందుకు తీసుకోలేపోతున్నారు అనే అనుమానం తలెత్తుతోందని భక్తులు, సిబ్బంది, స్థానికులు అంటున్నారు.

100 రోజుల్లో 71,000 ఇళ్ల
స్టేజ్ అప్డేషన్ జరగాలి

జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆకాంక్షల మేరకు ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలని, వంద రోజుల ప్రణాళికను అనుసరించి 71,133 ఇళ్లకు సంబంధించి స్టేజ్ అప్డేషన్ జరగాలని, ఆ దిశగా జిల్లా స్థాయి నుంచి క్షేత్ర స్థాయి వరకు గృహ నిర్మాణ శాఖ అధికారులు తీవ్ర కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. జిల్లాలోని పట్టణ, గ్రామీణ లేఅవుట్లలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు, వాటి పురోగతిపై శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ మీటింగ్ హాలులో గృహ నిర్మాణ శాఖ పీడీ డి.అఖిల, ఇతర అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. లేఅవుట్ల తాజా పరిస్థితిని ఆయా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో లేఅవుట్లలో పరిస్థితిని, ఇళ్ల నిర్మాణాల పురోగతిని వివరిస్తూ గృహ నిర్మాణ శాఖ పీడీ ప్రజెంటేషన్ ఇచ్చారు. గ్రామీణ పరిధిలోని 138 లేఅవుట్లు, అర్బన్ పరిధిలో 64 లేఅవుట్లు ఉన్నాయని, 1.39 లక్షల ఇళ్లు కేటాయించగా 1.29 ఇళ్లు మంజూరు అయ్యాయని వివరించారు. వాటిలో అన్ని దశల పనులు పూర్తి చేసుకున్నవి 23,995 ఇళ్లు ఉన్నాయని, మిగిలినవి ఇతర దశల్లో ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా 100 రోజుల ప్రణాళికతో అందరూ పని చేయాలని సూచించారు. నిర్దేశించిన లక్ష్యాలను చిత్తశుద్ధితో పని చేసి చేరుకోవాలని చెప్పారు. 100 రోజులకు గాను 71,133 ఇళ్లకు సంబంధించి స్టేజ్ అప్డేషన్ జరగాలని, 4,109 ఇళ్లను శ్లాబ్ లెవెల్ కు చేర్చాలని, 11,450 ఇళ్లను పూర్తి చేయాలని నిర్దేశించారు. గుత్తేదార్లు, లబ్ధిదారులతో మాట్లాడాలని వారం రోజుల్లో అన్ని లేఅవుట్లలో పనులు ప్రారంభం కావాలని ఆదేశించారు. ఆగస్టు 10వ తేదీ నుంచి రోజువారీ పురోగతిపై నివేదికలు సమర్పించాలని, అంతర్గత సమీక్షలు చేసుకోవాలని సూచించారు. జియో ట్యాగింగ్ ప్రక్రియ నిర్వహణకు లబ్ధిదారులు తప్పకుండా రావాలని, అధికారులకు, సిబ్బందికి సహకరించాలని హితవు పలికారు. ఆసక్తి కనబరచని గుత్తేదార్లతో మరొక్క సారి మాట్లాడి పనులను ప్రారంభించాలని, సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సమావేశంలో భాగంగా పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యత పాటించాలని, అధికారులు, సిబ్బంది, వర్క ఇన్స్పెక్టర్లు అధిక ప్రాధాన్యత ఇస్తూ అంకిత భావంతో పని చేయాలని సూచించారు. ఇసుక సరఫరాకు సంబంధించి సంబంధిత అధికారులకు చెబుతానని, లేఅవుట్ల వారీగా అవసరమైన ఇండెంట్ పెట్టాలని గృహ నిర్మాణ శాఖ అధికారులకు చెప్పారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ డి. అఖిల, ఈఈ సత్యనారాయణ, డీఈలు రామకృష్ణ, సూర్యప్రకాశ్, సీతారాం, ఏఈ సూర్యప్రకాశ రావు, ఇతర ఏఈలు, వర్క్ ఇన్స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

కంటి శుక్లాలు అంధత్వానికి ప్రధాన కారణం

నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ శిల్పా తరణి

విశాలాంధ్ర - విశాఖపట్నం: అంధత్వానికి ప్రధాన కారణంగా కంటి శుక్లాలే నిలుస్తున్నాయని, కంటి శుక్లాల శస్త్ర చికిత్స నిపుణులైన నేత్ర వైద్యుని పర్యవేక్షణలోనే జరగాలని ఎల్వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ శిల్పా తరణి తెలిపారు. ఈ మేరకు విశాఖ జీఎంఆర్ వరలక్ష్మీ ప్రాంగణం లోని ఎల్వి ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్‌లో శుక్రవారం కంటి శుక్లాలు, చికిత్సలు, అంధత్వం అనే అంశంపై జరిగిన వైద్య సదస్సులో డాక్టర్ మాట్లాడుతూ శుక్లాలు ప్రధానంగా కంటిలో వయసు సంబంధిత మార్పుల వల్ల కలుగుతాయన్నారు. మధుమేహం, మూత్రపిండ వ్యాధి, గ్లకోమా, కంటి గాయాలు, ఇన్ఫెక్షన్లు, కంటి లోపల వాపు, ఓవర్ ది కౌంటర్ మందులు, ధూమపానం యొక్క దీర్ఘకాలం కూడా కంటిశుక్లం అభివృద్ధికి దోహదం చేస్తాయన్నారు. జన్యుపరమైన లేదా జీవక్రియ లోపాలు, ఇన్ఫెక్షన్లు లేదా గాయం కారణంగా శిశువులు లేదా చిన్న పిల్లలలో కూడా కంటిశుక్లం సంభవించ వచ్చునని, పిల్లలలో, లక్షణాలు కంటిలో తెల్లగా కనిపించడం (ల్యూకోకోరియా), మెల్లకన్ను కనుబొమ్మల అసంకల్పిత వణుకు వంటివి కలిగి ఉండవచ్చు నన్నారు. స్టెరాయిడ్లను కలిగి ఉన్న ఓవర్-ది-కౌంటర్ మందులు కంటిశుక్లాలకు కారణమవుతాయని, ప్రజలు డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులను ఉపయోగించినప్పుడు, వారు తెలియకుండానే స్టెరాయిడ్ మందులకు గురవుతారన్నారు. ధూమపానం లేదా నమలడం రూపంలో పొగాకు ఉత్పత్తులను ఉపయోగించడం వల్ల కూడా కంటిశుక్లం ఏర్పడుతుందన్నారు. అనుభవజ్ఞుడైన నేత్ర వైద్యుడిచే కంటిశుక్లం శస్త్రచికిత్స చేయించడం చాలా ముఖ్యం అని, ఒక అనుభవజ్ఞుడైన నేత్ర వైద్యుడు శస్త్రచికిత్స సమయంలో తలెత్తే సమస్యలైన కంటి అనాటమీ లేదా అధునాతన కంటిశుక్లం వంటి సమస్యలను ఎదుర్కోగలుగుతారని చెప్పారు.

ఎస్సీ వర్గీకరణ సమంజసం కాదు

విశాలాంధ్ర - భీమిలి: అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉన్న మాల మాదిగ కులాలను వర్గీకరణ పేరుతో విభజించడం తగదని మాల మహానాడు వ్యవస్థాపకులు భాగం గోపాలరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం నియమించిన ఏడుగురు సభ్యులు గల సుప్రీంకోర్టు ధర్మాసనం రాష్ట్రానికి ఎస్సీ వర్గీకరణ చేసే అవకాశాన్ని కల్పిస్తూ ఇచ్చినటువంటి తీర్పును నిరసిస్తూ మాల మహానాడు రాష్ట్ర వ్యవస్థాపకులు భాగం గోపాలరావు నాయకత్వంలో నిరసన చేపట్టారు. భీమిలి జోన్ తగరపువలస అంబేద్కర్ కూడలి వద్ద గోపాలరావు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ నేపథ్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తపరిచారు. అనంతరం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర మాల మహానాడు వ్యవస్థాపకులు భాగం గోపాలరావు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయకుండానే వర్గీకరణ చేయడం ఎంతవరకు సమంజసం అన్నారు. వర్గీకరణలో చేపట్టిన ప్రాతిపదిక అంశాలు ఏమిటని ప్రశ్నించారు. గతంలో టిడిపి ప్రభుత్వం హయాంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఉండడంతో అధికారాన్ని కోల్పోయారన్నారు. ఇదే కులాల మధ్య చిచ్చు కొనసాగితే 2029లో బిజెపి, టిడిపి అధికారం కోల్పోవడం తధ్యమని హెచ్చరించారు. ఈ విషయాలను పరిగణలోకి తీసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వెనక్కు తీసుకునే విధంగా ఒత్తిడి తేవాలన్నారు. స్వాతంత్రం సిద్ధించి నేటికీ 77 సంవత్సరాలు అయినప్పటికీ ఇంకా గ్రామీణ ప్రాంతాలలో మాలలు అధ్వాన స్థితిలో ఉన్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గుడివాడ కిరణ్, గుడివాడ సూర్యనారాయణ, మామిడి శివ, భాగం కృష్ణ, ఉప్పాడ కిరణ్, మద్దిల తీన్ మూర్తి, రవ్వ ఈశ్వరరావు, గుడివాడ ఈశ్వరరావు, ఎడ్ల రమేష్ కుమార్, సందల సన్యాసిరావు, బోనీ ఆదిరాజు, ఎరుకొండ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

డైట్‌లో పింగళి వెంకయ్య జయంతి

విశాలాంధ్ర - భీమిలి: భారతమాత శిగలో మల్లెల గులాబీ హారం వంటి జాతీయ జెండాను రూపొందించిన పింగళి వెంకయ్య చిరస్మరణీయులని భీమునిపట్నం డైట్ సీనియర్ అధ్యాపకులు జిజివిఎస్ నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం డైట్లో పింగళి వెంకయ్య జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడు పింగళి వెంకయ్య తెలుగు వారు కావడం ఆయన రూపొందించిన జాతీయ జెండాను మహాత్మా గాంధీ ప్రశంసించడం అత్యంత గొప్ప విషయాలని అన్నారు. పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలవేసి అధ్యాపకులు, ఛాత్రోపాధ్యాయులు నివాళి అర్పించారు. ఛాత్రోపాధ్యాయులు పింగళి వెంకయ్యను కీర్తిస్తూ జాతీయ జెండా కు జేజేలు పలుకుతూ గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో సీనియర్ అధ్యా పకులు ఎల్.సుధాకర్ అధ్యాపకులు సి.ఏ.సోమయాజులు, ఎం.మహాలక్ష్మి, జై.మాధవి, పి.హరిణి, గొట్టేటి రవి తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రోలైట్స్ డ్రింక్ 'అడ్వాన్స్ కేర్' ప్రారంభం

విశాలాంధ్ర - విశాఖపట్నం: హైడ్రేషన్, శక్తి, రోగ నిరోధక శక్తే లక్ష్యంగా ఓఆర్ఎస్ఎల్ ఆధ్వర్యంలో సరికొత్త ఎలక్ట్రోలైట్స్ డ్రింక్ 'అడ్వాన్స్ కేర్' ప్రారంభమైందని సంస్థ ప్రతినిదులు ఒక ప్రకటనలో తెలిపారు. సరైన మొత్తంలో చక్కెర, ఎలక్ట్రోలైట్స్, జింక్, సెలీనియం వంటి రోగనిరోధక పోషకాల ప్రత్యేకమైన మిశ్రమంతో రూపొందించబడిందన్నారు. ఈ సందర్భంగా మెడికల్ సేఫ్టీ సైన్సెస్ హెడ్ - ఇండియా డాక్టర్ ప్రీతి ఠాకోర్ మాట్లాడుతూ ఈ డ్రింక్ డీహైడ్రేషన్ నుంచి త్వరగా కోలుకోవడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. సైన్స్ మద్దతుతో అత్యుత్తమ రుచితో పాటు కీలక పోషకాలతో రూపొందించారని తెలిపారు. ప్రతి ఉత్పత్తి వేగవంతమైన రికవరీకి తోడ్పడేందుకు వివిధ రకాల హైడ్రేషన్ అవసరాలు తీర్చనుందన్నారు. ఓఆర్ఎస్ఎల్ ఇమ్యూనిటీం ఎలక్ట్రో లైట్స్, ఇమ్యునోన్యూట్రియెంట్‌లతో సరైన హైడ్రేషన్ అందిస్తుందని తెలిపారు.

రోగనిరోధక వ్యవస్థకు మద్దతుగా ఉంటాయన్నారు. సూక్ష్మజీవులు, వ్యాధులకు వ్యతిరేకంగా మన శరీరంలో మొదటి రక్షణ శ్రేణి ఇదన్నారు. ఈ సందర్భంగా సీనియర్ గ్యాస్ట్రోఇంటెస్టినల్, జనరల్ సర్జన్ కేర్ హాస్పిటల్ - ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ డాక్టర్ బీ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ శరీరంలో ఎలక్ట్రో లైట్‌లతో పాటు ద్రవాల లోపం ఉన్నప్పుడు డీహైడ్రేషన్ ఏర్పడే పరిస్థితి ఉంటుందన్నారు.

మాదకద్రవ్యాల
అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జిల్లాలో మాదక ద్రవ్యాలు, గంజాయి అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు సమిష్టి కృషిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత భాగ్చి సంబంధిత అధికారులకు పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, సీపీ అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్, సీపీ మాట్లాడుతూ విశాఖపట్నం జిల్లాలో మాదకద్రవ్యాలను, గంజాయిని పూర్తిగా నిర్మూలించేందుకు జిల్లా, పోలీస్ యంత్రాంగం అనేక చర్యలు చేపట్టిందన్నారు. ప్రభుత్వం కూడా దీనిపై ప్రత్యేక దృష్టి సారించిందని గుర్తుచేసారు. 100 రోజుల్లో మాదకద్రవ్యాలను, గంజాయిని పారద్రోలేందుకు ఇప్పటికే ప్రణాళికను సిద్ధం చేసినట్లు చెప్పారు. వివిధ రకాల మార్గాల ద్వారా విశాఖ జిల్లాకు గంజాయిని తరలిస్తున్నారని, వాటిని అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గంజాయి రవాణా చేసే మార్గాల్లో చెక్ పోస్టులు పెట్టి తనిఖీలు నిర్వహించి, సీజ్ చేస్తున్నట్లు చెప్పారు. స్నిఫర్ డాగ్స్ ద్వారా రైల్వే స్టేషన్లు, బస్ స్టాండులు, బ్యాగేజీ లాకర్లు, పార్శిల్ ఆఫీసులు, అనుమానిత వాహనాలు, షాపుల్లో గంజాయిని, మాదకద్రవ్యాలను గుర్తిస్తున్నామని, ఇందుకోసం ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. మత్తుకు బానిసై నిరాశ, నిస్పృహలకు లోనైన వారికోసం మార్పు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, డీ - ఎడిక్షన్, రీహేబిలిటేషన్ సెంటర్ల ద్వారా మత్తు నుండి విముక్తులని చేస్తున్నట్లు చెప్పారు. పాఠశాల, కళాశాల, విశ్వవిద్యాలయాల్లో యువతకు, తల్లితండ్రులకు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. గంజాయి, మత్తు పదార్థాలు తీసుకునే ప్రాంతాలను గుర్తించి, చీకటి ప్రదేశాల్లో లైట్లను అమర్చడం, సీసీ కెమెరాలను ఏర్పాటుచేయాలని తెలిపారు. గంజాయి, మాదకద్రవ్యాలు వివిధ మార్గాల్లో వచ్చే అవకాశమున్నందున ప్రతి అధికారి బాధ్యతగా వ్యవహరించి తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో జాయింట్ పోలీస్ కమిషనర్ డా. కె.ఫక్కీరప్ప, కస్టమ్స్, పోర్ట్, నార్కోటిక్, డ్రగ్స్, మత్స్య శాఖ అధికారులతో పాటు ఆర్ అండ్ బి పర్యవేక్షక ఇంజినీర్ కె.కాంతిమతి, జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. వి.జగదీశ్వరరావు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎస్.వి.రమణ, రవాణా, పోలీస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: అమలాపురం - విశాఖ ఆర్టీసీ బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్న గనిరెడ్డి మారి నాయుడు మార్గ మధ్యంలో నలతగా అనిపించడంతో అపోలో ఫార్మసి వద్ద జ్వరం టాబ్లెట్ తీసుకొని విశ్రాంతి కోసం కూర్చొని ఉండగా అది గమనించిన నలుగురు నిందితులలో ఒకరైన కిరణ్ దాడి చేసి అతడి వద్దనున్న బ్యాగును చోరీ చేశారు. అతని బ్యాగులో మూడు వేల నగదు చోరీ చేశారు. దాడి చేసి నగదు చోరీ చేసిన కేసులో నిందితులను అరెస్ట్ చేసినట్లు మీడియా సమావేశంలో క్రైమ్ డీసీపీ వి.వెంకట రత్నం తెలిపారు. బాధితుని వద్ద నుంచి 112కి ఫిర్యాదు అందుకున్న వెంటనే స్పందించిన ఎంవీపీ, త్రీ టౌన్ పోలీసులు సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా నిందితులను పాత రేశపు వానిపాలెం నివాశస్తులుగా గుర్తించిన కిరణ్, పిలక సదానందతో పాటు ఇద్దరు వ్యక్తులు మైనర్లును అరెస్ట్ చేశామన్నారు. కిరణ్‌పై ఇదివరకే కేసు ఉందని గుర్తుచేశారు. నిందితులను కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించా రన్నారు. రాత్రి గస్తీ ముమ్మరం చేశామని గంజాయి బ్యాచ్‌ను పట్టుకోవడానికి తనిఖీలు చేస్తున్నామని క్రైమ్ డీసీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో త్రీ టౌన్ క్రైమ్ సీఐ ఆదం, ఎంవీపీ క్రైమ్ సీఐ సి.హెచ్. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాబోయ్ బైక్ దొంగలు

మండలంలో హల్ చల్ చేస్తున్న బైక్ దొంగల ముఠా

అప్రమత్తమైన పోలీసు అధికారులు

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలంలో సొంత్యాం పంచాయతీ పరిధిలో గొంతువానిపాలెం గ్రామ ఎంజీఆర్ పురం చెక్ పోస్ట్ వద్ద రెండు రోజుల క్రితం బైక్ దొంగతనాలు జరిగాయని ద్విచక్ర వాహన యజమానులు వాపోతున్నారు. ఇంటిలో పార్కింగ్ చేసుకున్న భారీ ద్విచక్ర వాహనాలను టార్గెట్‌గా చేసుకొని అర్ధరాత్రి సమయంలో రాత్రి 11:00 సమయంలో ఈ దొంగతనాలు చేస్తున్నట్లు స్థానికులు వాపోతున్నారు. చందవరపు శివకుమారి యమహా ఆర్ 15, వేరొక వ్యక్తిది పల్సర్ బైక్‌లను బైక్ దొంగలు ఎత్తుకుపోయారని ఫిర్యాదు చేశారు. బాధితులు ఆనందపురం పోలీస్ స్టేషన్లో రెండు రోజుల క్రితం ఫిర్యాదు చేసినట్లు తెలుస్తుంది. అప్రమత్తమైన పోలీస్ అధికారులు దొంగలను కనుగొనే విధంగా ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. వారితో పాటు బాధితులు కూడా సీసీ కెమెరాల ఆధారంగా సమాచారం రాబట్టే పనిలో ఉండగా పెందుర్తి వైపు నుంచి ముగ్గురు ఒకే బైక్ పై వచ్చి ఈ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తుందని చెబుతున్నారు. ఏదేమైనా సరే బైకు దొంగల విషయంలో పోలీసులకు సరైన సవాళ్లే ముందున్నాయని తెలుస్తుంది. ఎలాగైనా దొంగల్ని పట్టుకొని వారి వాహనాలను వారికి చేర్చాలని బాధితులు పోలీసు వారికి విజ్ఞప్తి చేస్తున్నారు.

సిపిఎం ఆధ్వర్యంలో విరాళాల సేకరణ

విశాలాంధ్ర - భీమిలి: కేరళ వరద బాధితులు సహాయార్థం సిపిఎం పార్టీ భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యంలో రిలీఫ్ ఫండ్ సేకరించారు. కేరళ రాష్ట్రంలో వాయినాడు జిల్లా మిగత ప్రాంతాల్లో వర్షాలు వరదలతో సుమారు 300కు పైగా మృత్యువాత చెందగా వెయ్యి మందికి పైగా తీవ్ర గాయాలు కాగా ఇంకా అనేకమంది కొండ చరియల కింద నలిగి కుటుంబాల కుటుంబాలుగా మృత్యువాత

పడుతున్నారని దీనికి గాను సీపీఎం విరాళాలను సేకరించింది. ముందుగా వర్తక సంఘం అధ్యక్షులు వెంకటరమణ కార్యక్రమాన్ని ప్రారంభించగా 5517 రూపాయలు రిలీఫ్ ఫండ్ సేకరణ జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా నాయకులు ఆర్ఎస్ఎన్ మూర్తి, భీమిలి సిపిఎం పార్టీ జోన్ కమిటీ నాయకులు ఎస్.అప్పలనాయుడు, నాగరాజు, భీమిలి ముఠామేస్త్రి, గురప్ప తదితరులు పాల్గొన్నారు.

5వ జోన్‌లో బహిరంగ వేలం వాయిదా

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ జోన్-5 జ్ఞానాపురం కార్యాలయము నందు ఆగస్టు 5, 2024న ఉదయం 11 గంటలకు జరగవలసిన బహిరంగ వేలం అనివార్య కారణాల వలన వాయిదా వేయడమైనదని జోనల్ కమిషనర్ ఆర్ జి వి కృష్ణ శుక్రవారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. తదుపరి బహిరంగ వేలం ఎప్పుడు నిర్వహించబడుతుందో పత్రికా ప్రకటన ద్వారా తెలియ చేయగలమని, పూర్తి వివరాల కొరకు 5వ జోనల్ కార్యాలయం జ్ఞానాపురం పర్యవేక్షకుల వారిని పని వేళలో సంప్రదించవచ్చని జోనల్ కమిషనర్ తెలిపారు

పురుగు మందు తాగి వ్యక్తి మృతి

విశాలాంధ్ర - పద్మనాభం: విజయానందపురం గ్రామానికి చెందిన పాలెపు అప్పలరాజు (56) అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందుల కారణంగా గడ్డి మందు తాగి మృతి చెందినట్టు పద్మనాభం పోలీసులు తెలిపారు. విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్ప గించినట్లు తెలియజేశారు. మృతుడు అప్పలరాజు ప్రైవేట్ సంస్థలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నట్లు తెలియజేశారు. ఏఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అతిసార వ్యాధి నిర్మూలనపై గడపగడపకు ప్రచారం

విశాలాంధ్ర - ఆనందపురం: అతిసార వ్యాధిని అరికట్టేందుకు వ్యాధి నిర్మూలనపై జల జీవన మిషన్ ఆధ్వర్యంలో వేములవలస, పెద్దిపాలెం గ్రామంలో శుక్రవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. జిల్లా కోఆర్డినేటర్ ఎం.ఆనంద్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని మంచినీటిపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటి శుభ్రతను పాటించి చేతులను శుభ్రంగా కడుక్కోవాలి అన్నారు. ముఖ్యంగా మంచినీటి ద్వారానే అతిసారం ప్రబలే అవకాశం ఉన్నదని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం నాగభూషణం, సచివాలయం గ్రామ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.